ప్రజాశక్తి
శుక్రవారం 4 జులై 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, రియాజ్

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్

పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మార్కాపురంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-మార్కాపురం

డిప్యూటీ సిఎం కె.పవన్ కళ్యాణ్ మార్కాపురానికి శుక్రవారం మధ్యాహ్నం రానున్నారు. ఈ పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ ఏర్పాట్లను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్ ఏర్పాట్లలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సిఎం చంద్రబాబు గతంలో అక్కడే సభ నిర్వహించారు. సిఎం చంద్రబాబు పర్యటనకు ఏ మాత్రం తగ్గకుండా పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లు జరుగుతుండటం గమనార్హం.

మార్కాపురం శివారులోని నరసింహాపురం ఇలాఖాలో పశ్చిమ ప్రకాశంలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు జలజీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ.1,290 కోట్లతో నిర్మించనున్న తాగునీటి ప్రాజెక్టుకు పవన్‌కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ▶ 2లో

రూ.2 కోట్ల జెట్టీతో సరి.!

- రూ.450 కోట్ల ఫిషింగ్ హార్బర్‌కు మంగళం.!
- రియల్ దెబ్బకు రద్దు జాబితాలో వాడరేవు ఫిషింగ్ హార్బర్ ?

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల వాడరేవులో మూడేళ్ల క్రితం స్థానిక మత్స్యకారుల కోసం సముద్రపు అలలపై తేలియాడే ప్లోటింగ్ హార్బర్ నిర్మిస్తున్నట్లు అధికార యంత్రాంగం చెప్పింది. కానీ ఈ తరువాత సముద్రం ఒడ్డున భూ ఉపరితలం మీద రూ.450 కోట్ల అంచనాలతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు గత వైసిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన కూడా చేశారు. కానీ సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు మొదలుకాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం వద్ద తగిన బడ్జెట్ లేని కారణాన్ని చూపుతూ రూ.150 కోట్లతో లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామన్నారు. కానీ అది కూడా ప్రతిపాదనలకే పరిమితమైంది. చివరికి వాడరేవు మత్స్యకారుల కోసం రూ.2 కోట్లతో జెట్టీ నిర్మిస్తామని ప్రస్తుతం చెబుతున్నారు.

బాపట్ల జిల్లాలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 65 మత్స్యకార గ్రామాల్లో 54 వేల మంది మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకొని జీవిస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల బోట్లు కలిపి 2,986 వరకు ఉన్నాయి. సముద్రతీర ప్రాంతంలో ఉండే మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. ప్రతి రోజూ లోతైన సముద్రజలాల్లో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లను సముద్రపు ఒడ్డున నిలిపి ఉంచేందుకు జిల్లా తీరంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో మత్స్య కారులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, చీరాల వాడరేవుల్లో రెండు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలు జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు నిజాంపట్నం వద్ద రూ.450 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతోంది. వాడరేవు సముద్ర తీరంలో ఎక్కడ కూడా బోట్లను సురక్షితంగా నిలిపి ఉంచే సౌలభ్యం లేకపోవడంతో తుపాన్లు, వేట విరామ సమయాల్లో చీరాల వాడరేవు చుట్టుపక్కల ఉన్న గ్రామాల మత్స్యకారులందరూ ఇప్పటివరకు నిజాంపట్నం వెళ్లి అక్కడ తమ బోట్లను లంగరు వేస్తూ వస్తున్నారు. కొందరు ఈపురుపాలెం స్ట్రయిట్ కట్‌లో తమ బోట్లను నిలుపుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ▶ 2లో

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

- ప్రతి నియోజకవర్గానికి 10 వేల సూర్యఘర్ యూనిట్లు మంజూరు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల, మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-పొదిలి

రాష్ట్రంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గం పొదిలి మండలంలోని ఏలూరు గ్రామంలో 3311 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు గురువారం మంత్రి గొట్టిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యలను నివారించేందుకు జిల్లావ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ప్రజలతో పాటు రైతులకు, పారిశ్రామిక, వ్యాపార అవసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని తెలిపారు. ఇందుకుగాను ప్రకాశం జిల్లాలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత 6 కొత్త సబ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాట్లు మంత్రి వివరించారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను ప్రజలతో పాటు రైతులందరూ సద్వినియోగం ▶ 2లో

రైల్వే ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న పోలీసులు

మత్తుపై పోలీసుల ఉక్కుపాదం

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో పోలీస్, ఈగిల్ టీం విస్తృత తనిఖీలు

▶ 8లో

రూ.2 కోట్ల జెట్టీతో సరి.!

(మొదటిపేజీ తరువాయి)

మంజూరైంది. 2023 మే 15న అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. వాడరేవు సముద్రపు ఒడ్డున ఉన్న 19 ఎకరాల భూమిని హార్బర్ కోసం కేటాయించారు. గతంలోనే టెండర్ కూడా ఖరారు అయ్యాయి. నాబార్డు నిధుల మంజూరుతో పాటు రాష్ట్రం వాటా నిధుల విడుదలలో జరిగిన జాప్యం కారణంగా ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫిషింగ్ హార్బర్ నిర్మాణ వ్యయాన్ని మూడో వంతుకు కుదించారు. రూ.150 కోట్ల అంచనాలతో లోకాస్ట్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం నూతన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ అది కార్యరూపం దాల్చేలా లేదు. జిల్లాలో బాపట్ల సముద్రతీరం నుంచి చినగంజాం వరకు రానున్న కాలంలో రిసార్టులు, హోటళ్లు, వాటర్‌స్పోర్ట్స్ రానున్నాయి. తీరం అంతటా రియల్‌ఎస్టేట్ దారుల హవా సాగుతోంది. సముద్రపు అలల వరకు ఉన్న భూభాగం అంతా రియల్‌దారుల చేతిలోకి వెళుతోంది. పర్యాటక రంగ అభివృద్ధి పేరుతో భూములన్నీ రియల్‌దారుల సొంతం అవుతున్నాయి. మత్స్యకారులు తమ బోట్లను నిలుపుకునేందుకు కూడా రానున్న రోజుల్లో జాగా దొరిగే పరిస్థితి లేదు.

ఈ నేపథ్యంలో వాడరేవు తీరంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కష్టం అని తెలుస్తోంది. దీనికి తోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రతిపాదనలు ముందుకొచ్చాయి. ఈ మేరకు రూ.379 కోట్లతో హార్బర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఇందుకోసం కేంద్రం రూ.150 కోట్లు, నాబార్డు నిధులు రూ.218, రాష్ట్రం వాటా ధనం రూ.24.25 కోట్ల నిధులతో కొత్తపట్నం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరగనుంది. ఇటు నిజాంపట్నం, అటు కొత్తపట్నంలలో హార్బర్ల నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో చీరాల వాడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణం అటకెక్కినట్లు తెలుస్తోంది.

మంచినీటి కుళాయి కనెక్షన్ ప్రారంభం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం, తిమ్మాపురం బిసి కాలనీలో గురువారం సర్పంచ్ పసుపుల మల్లీశ్వరయ్య ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికి కుళాయి, మంచినీరు సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా మంచినీటి బోరుకు పూజలు నిర్వహించి మోటారు స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ప్రతి ఇంటికీ నీరు అందించే కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

అక్కడకు విచ్చేసిన ప్రజలతో మాట్లాడేందుకు అక్కడో వేదికను సిద్ధం చేశారు. ఐదువేల మంది కూర్చురేందుకు సీటింగ్ ఏర్పాటు చేశారు. పవన్ పర్యటనతో మార్కాపురంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీస్ బందోబస్తు

పవన్‌కళ్యాణ్ సభకు జరుగుతున్న ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ గురువారం పర్యవేక్షించారు. మార్కాపురం శివారులోని నరసింహపురంలో సభా వేదిక, కాన్వాయ్ రూట్, గ్రీన్ రూమ్, విఐపి ఎంట్రన్స్ మార్గం, పార్కింగ్ ప్రదేశాలతో పాటు అక్కడి ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ దామోదర్ సమావేశం నిర్వహించారు. బందోబస్తు విధులలో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఎస్‌పి దామోదర్ వెంట అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నాగేశ్వరరావు, మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ యు.నాగరాజు, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమణ కుమార్, కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్, ఏఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, మార్కాపురం సిఐ సుబ్బారావు, పలు ప్రాంతాలకు చెందిన సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి

ప్రజాశక్తి-మర్రిపూడి

తల్లికి వందనం విద్యార్థులతో డోల ఆనందం

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం సాయంత్రం మర్రిపూడి మండలం గుండ్ల సముద్రం గ్రామం ఎస్సీ కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. నలుగురు పిల్లలున్న కుటుంబానికి కూడా తల్లికి వందనం ద్వారా రూ.52,000 జమ చేశామన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను వృద్ధులు, వితంతువులకు రూ.నాలుగు వేలకు పెంచామని తెలిపారు. ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తోందని అన్నారు. హామీ ఇచ్చిన పథకాలలో ప్రతి కుటుంబానికీ గృహ నిర్మాణానికి ఎస్సీ ఎస్టీలకు రూ.3 లక్షల వరకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం కేంద్రం వాటాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులను ఈ నెలలో ఒక్కొక్క రైతుకు ఏడు వేలు అందజేస్తామన్నారు. తమ ఎలక్షన్ల హామీ అయిన అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని అన్నారు. యువతకు 16,347 పోస్టులతో డీఎస్సీ నియామకాలు త్వరలోనే చేపట్టబోతున్నారని, పోలీస్ శాఖలో నియామకాలు జరిపారని, పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల మంది ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు రేగుల వీరనారాయణ, తుళ్లూరు వెంకట నరసింహం, లెక్కల భాస్కర్ చౌదరి, గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆయా బూత్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. రూ.3.90 కోట్లతో నిర్మిస్తున్న సబ్ స్టేషన్‌తో చుట్టుపక్కల ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా రైతులకు పగటి పూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. అర్ధరాత్రి పొలాలకు వెళ్లి విద్యుత్ వినియోగించు కునే అవసరం ఇకపై ఉండదని మంత్రి తెలిపారు.

వైసిపి రాష్ట్రాన్ని దివాలా తీయించింది: కందుల

గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సదుపాయం కల్పించబోతున్నారని అన్నారు. ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు, దర్శి ఈఈ పాలగిరి శ్రీనివాసులు, పొదిలి డిఇడి హరి బాబు రెడ్డి, ఆర్ఐ నరసింహారావు, పొదిలి మార్కాపురం ఏఎంసీ చైర్మన్లు సయ్యద్ ఇమామ్ సహెబ్, మాలపాటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **L SUBBAMMA** is legally Mother of No: **2609706A**, Rank: **HAV**, Name: **LOKAM RAMANJANEYULU**, presently residing at Cumbum Village & Post, Cumbum Mandal & Tehsil, Prakasam District, Andhra Pradesh-523333. have changed my Name from **L SUBBAMMA** to **LOKAM SUBBAMMA** as per affidavit dated 03-07-2025 before public Notary, Giddalur.

మహారాజశ్రీ ఒంగోలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S.No: 346/2024

కెనర బ్యాంక్, కమ్మపాలెం బ్రాంచి,
రిప్రజెంటెడ్ బై బ్రాంచి మేనేజరు ఒంగోలు ...వాది
వర్సెస్
1.ఎస్.వి.ఎస్.అగ్రి ఏజెన్సీస్, రెప్ర.ప్రొపరైటర్. తన్నీరు వెంకట్రావు,
2.కే.శివ కుమార్ ...ప్రతివాదులు

To

ప్రతివాది-1
ఎస్.వి.ఎస్. అగ్రి ఏజెన్సీస్, రెప్ర. ప్రొపరైటర్. తన్నీరు వెంకట్రావు, తండ్రి మస్తాన్, డోర్ నెంబర్.37-1-404, ట్రంక్ రోడ్,ఒంగోలు.

ప్రతివాది-2
కే.శివ కుమార్, తండ్రి చిన్న కృష్ణయ్య కమ్మపాలెం,ఒంగోలు.

వాది దావా పరిహారము రాబట్టుకోను నిమిత్తం పైనెంబరు మీ పై దావా దాఖలు చేయగా మీకు దావా సమన్లు నిమిత్తము తేది:21-08-2025 ఉదయం 10 గంటల 30 నిమిషాలకు వాయిదా ఉన్నందున మీరు స్వయంగా గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు. //

ఇట్లు
దండూరి వెంకటేశ్వర్లు
వాది తరపు న్యాయవాది,
ఒంగోలు, ప్రకాశం జిల్లా
సెల్ నెంబర్ : 9397865123

ఆర్డర్ 21, రూల్ 48 సి.పి.సి నోటీసు

మహారాజశ్రీ
గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. నెం: 64/2023
ఇన్
ఓ.ఎస్. నెం: 296/2022

మీనిగ నారాయణ .... డి.హెచ్.ఆర్
వర్సెస్
చిట్టెం నాగరాజు .... జె.డి.ఆర్
టు,
చిట్టెం నాగరాజు, తండ్రి: ఆవులయ్య
వయసు: 41 సం॥లు, హిందూ, అసిస్టెంట్ ఇంజనీర్, నివాసం: బొల్లుపల్లి గ్రామం, అర్ధవీడు మండలం, ప్రకాశం జిల్లా.

ప్రస్తుతం పనిచేస్తున్నది: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్‌డబ్ల్యుఎస్) ఆఫీసు, కోర్టు ఎదురుగా, పొదిలి టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పైనెంబరు అమలు అర్జీలో డిహెచ్ఆర్, నీ పైన నీ జీతం జప్తు చేయు నిమిత్తం అమలు అర్జీని దాఖలు చేసుకొని ఉన్నాడు. సదరు అమలు అర్జీలో నీ జీతం జప్తు చేయుటలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 15-07-2025వ తేదీ ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయముగా లేదా వకీలు గారి ద్వారా హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల నీ పరోక్షమందు సదరు పిటీషన్‌ను విచారించి తీర్మానించబడునని నీకు తెలియజేయడమైనది.

// కోర్ట వారి అనుమతిన //

శ్రీ ఉదయగిరి మల్లికార్జునరావు
డిహెచ్ఆర్ పరం అడ్వకేట్,
గిద్దలూరు.

మహారాజశ్రీ ఒంగోలు అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఐ.పి.నెం.16/2023

మధ్యలో :
కాకరపర్తి వెంకటేశ్వర్లు ...పిటీషనరు
మరియు
కొమ్మాలపాటి ఆంజనేయులు, వగైరాలు ...రెస్పాండెంట్స్
టు :-

Respondent No.13 :-
శింగంశెట్టి రుక్మిణమ్మ, తండ్రి భుజంగరావు, నివాసం - వర్మగ్రాండ్ హోటల్ ఎదురు, మారుతీనగర్, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.

పై నంబరు ఐ.పి.లో 13వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా ఐ.పి. నోటీసులు పంపిననూ, వాటిని తీసుకొననందున కోర్టువారు మీకు ఐ.పి. నోటీసులు జారీచేయు నిమిత్తము తేది:22.07.2025న వాయిదా వేసి సదరు వాయిదాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయముగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేని యెడల కోర్టువారు మీకు పరోక్షము గా తీర్మానించబడునని తెలియజేయడ మైనది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 22-07-2025.

ఇట్లు
గుడిపూడి సురేంద్ర, B.Sc., LL.B.,
మిరియాల ప్రమోద్, M.A, LL.B.,
జానపాటి అనిల్ కుమార్, M.A, LL.B.,
పిటీషనరు తరపున న్యాయవాదులు
ఒంగోలు, ప్రకాశం జిల్లా.
సెల్ : 9441997200.

దర్శి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA No :425/2024
In
AS No :

కురంగి సుబ్బమ్మ వగైరాలు ... పిటీషనర్స్
వర్సెస్
సయ్యద్ మహబూబ్‌బి ... రెస్పాండెంట్

To
సయ్యద్ మహబూబ్‌బి
భర్త: రసూల్
చీఫ్ ఇన్స్పెక్టర్, APSRTC అద్దంకి డిపో
అద్దంకి టౌన్, బాపట్ల జిల్లా.

పిటిషనర్లు అప్పీలు దాఖలు చేయటంలో గల ఆలస్యమును మన్నించవలసినదిగా కోరుచు పిటిషన్ దాఖలు చేయగా మీ యొక్క హాజరు నిమిత్తం తేదీ:09-07-2025 వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన అనగా 09-07-2025ఉదయం 10:30 లకు మీరు గాని మీతరఫున లాయర్ గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ చేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: 09.07.2025

ఇట్లు
వి.రమణారెడ్డి
అడ్వకేట్
పిటిషనర్స్ తరపు న్యాయవాది
దరిశి, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఓ.యస్.నెం.928/2023

మధ్యలో :
కెనరా బ్యాంక్, యస్.యం.ఇ. బ్రాంచ్, ఒంగోలు తరపున బ్రాంచ్ మేనేజర్ ...వాది
మరియు
మేకనబోయిన శివకుమార్, వగైరా ...ప్రతివాదులు
టు :-

1వ ప్రతివాది :
మేకనబోయిన శివకుమార్,
తండ్రి గురవయ్య,
అసిస్టెంట్ ఇంజనీర్, ఎ.పి.యస్.పి.డి.సి.యల్.,
నివాసం - డోరు నెం.37-1-148,
రామ్‌నగర్ 3వ లైను, ఒంగోలు టౌన్,
ప్రకాశం జిల్లా - 523001.

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా దావా సమను నోటీసులు పంపిననూ,వాటిని తీసుకొననందున కోర్టువారు మీకు దావా సమను నోటీసులు జారీచేయు నిమిత్తము తేది:20-08-2025న వాయిదా వేసి సదరు వాయిదాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా రోజున ఉదయం గం॥10:30ని॥లకు మీరు స్వయముగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేని యెడల కోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 20-08-2025.

ఇట్లు
సి.బాలవర్ధిరాజు, M.B.A., LL.B.,
జె.అనిల్ కుమార్, M.A., LL.B.,
వాది తరపున న్యాయవాదులు,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.
సెల్ : 9290774633.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి. 23/2022
ఇన్
ఓ.ఎస్. 33/2017

పిక్కిలి చిన్న కాశయ్య .... డి.హెచ్.ఆర్
వర్సెస్
మండ్లా రమణయ్య ..... జె.డి.ఆర్
టు,
మండ్లా రమణయ్య, తండ్రి: పుల్లయ్య
సుంకేసుల గ్రామం, పెద్దారవీడు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లో డి.హెచ్.ఆర్. దావా డిక్రీ అమలు నిమిత్తం నీపై ఇ.పి. వేయగా, నీవు కోర్టు వారి నోటీసు అండర్/ఆర్డర్ 21 రూల్ 22 తీసుకొనక కాలాయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు నోటీసు జారీచేయుటకు 17-7-2025కి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా గానీ, ప్లీడరు ద్వారా గానీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల నీ పరోక్షమున అమలు పిటీషన్‌ను తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

మల్లంపాటి శివశంకరరెడ్డి,
అడ్వకేట్, మార్కాపురం,
సెల్: 9440252342.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్ సీనియర్ రీజినల్ మేనేజర్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్, నెల్లూరు వారు నాకు ఇచ్చిన సంజాయిషి మేరకు ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరు గ్రామం కు చెందిన 1. మాదాసు నాగేశ్వరరావు తండ్రి వీరరాఘవయ్య, 2. మాదాసు మధుబాబు తండ్రి కృష్ణమూర్తి మరియు 3. మదాసులీలావతి భర్త కృష్ణ మూర్తి అనువారలు శ్రీపతి ప్రకాశం కుమారుడు సురేష్ నకు అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్ డాక్యూమెంటు నం.2276/2022 రు తేది. 26-09-2022న నాక్లయింట్ ద్వారా పెట్రోలు బంకు వ్యాపారం నిర్వహించుటకు లీజు డాక్యూ మెంటు పొందియున్నాడు. శ్రీపతి సురేష్ పెట్రోలు బంకు వ్యాపారం నిర్వహించుటకు ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో ఈప్రకటన వెలువడిన 10 రోజులలోగా నాక్లయింట్‌కు గాని నాకు గాని రాతపూర్వకంగా అభ్యంతరములు తెలుపగలరు లేనియెడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించగలము.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, అమ్మనబ్రోలు సబ్ రిజిస్ట్రార్, ఉప్పుగుండూరు గ్రామం సర్వే నం. 106-1A, 107-2E లో AC.0.60 CENTS భూమి
హద్దులు
తూర్పు : పై సర్వే నెంబర్ లో మా తాలూకు స్వంత భూమి
దక్షిణం : పైన పేర్కొన్న సర్వే నెంబర్ లో జాతీయ రహదారి నం.216
పశ్చిమం : పై సర్వే నెంబర్ లో మా తాలూకు స్వంత భూమి
ఉత్తరం : పై సర్వే నెంబర్ లో మా తాలూకు స్వంత భూమి

ఇట్లు,
పి.యస్.వి.సత్యనారాయణరెడ్డి,
అడ్వొకేట్, జిల్లాకోర్టు ఎదురు, ఒంగోలు.
CELL NO.9390411081 & 7993932981.

అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థినులకు శాపం..

- ప్రారంభానికి నోచని వసతి గృహ భవనం
- ఇరుకు గదులతో ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రారంభానికి నోచని వసతి గృహ భవనం ఇదే..

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

అధికారుల నిరక్ష్యం.. విద్యార్థినులకు శాపంగా మారింది. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శనిలా తయారైంది మండలంలోని శీలంవారిపల్లి జడ్‌పిహెచ్‌ఎస్ ప్లస్ విద్యార్థినుల పరిస్థితి. విద్యార్థినుల సౌకర్యార్థం కోట్లు ఖర్చు చేసి బాలికల వసతి గృహం నిర్మించారు. అవసరమైన ఉద్యోగులను నియమించలేదు. దీంతో భవనం ప్రారంభానికి నోచలేదు. విద్యార్థినులు ఇక్కట్లు తప్పడం లేదు. శీలం వారి పల్లి జడ్‌పిహెచ్‌ఎస్ ప్లస్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల సౌకర్యార్థం రూ. 1.94 కోట్లు ఖర్చు చేసి పాఠశాల ఆవరణలో అన్ని వసతులతో కూడిన హాస్టల్ భవనాన్ని నిర్మించారు. పాఠశాల ఉపాధ్యాయులు మండలంలోని అన్ని గ్రామాలలో తిరిగి దాదాపు 90 మంది విద్యార్థినులను ఇందులో చేర్పించారు. పాఠశాలలో విద్యాబోధన బాగుండటం, హాస్టల్‌లో వసతి సౌకర్యాలు అనుకూలంగా ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించారు. హాస్టల్ నిర్వహణకు అవసరమైన వార్డెన్‌ను, పార్ట్ టైం టీచర్‌ను నియమించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో హాస్టల్‌ను నిర్వహించే వారు లేక పోవడం తో భవనం నిరుపయోగంగా మారింది. విద్యార్థినులు కదిరి బాబూరావు ఉద్యానవన కళాశాలలోని హాస్టల్ లో భోజనం చేస్తూ, ఆ ప్రక్కనే ఉన్న ప్రైవేట్ భవనం లోని హాస్టల్‌లో తల దాచుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఆ భవనంలోని గదులు చాలక పోవడంతో ఇరుకుగదులలో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వసతులు ఉన్నాయనుకుని తమ పిల్లలను ఇక్కడ చేర్చామని ఇలా ఇబ్బందులు పడుతూ ఈ పాఠశాలలో చదివించాల్సిన అవసరం తమకు లేదని టీసీ లు ఇప్పిస్తే తమ పిల్లలను వేరే పాఠశాలలో చేర్చుకుంటామంటూ పాఠశాల హెచ్‌ఎంపై ఒత్తిడి చేస్తున్నారు. అధికారులతో మాట్లాడి అన్నీ ఏర్పాట్లు చేస్తామంటూ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినుల తల్లిదండ్రులకు నచ్చ చెబుతూ నెట్టుకొస్తున్నారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, గేట్ కీపర్ లను నియమించిన అధికారులు వార్డెన్‌ను నియమించక పోవడం పట్ల విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డెన్‌ను, పార్ట్ టైం టీచర్ ను నియమించాలని వారు కోరుతున్నారు.

వార్డెన్‌ను నియమించే కృషి చేస్తా : జిసిడిఒ

వార్డెన్ నియామకంపై జిసిడిఒ హేమలతను ప్రజాశక్తి వివరణ కోరగా వార్డెన్ నియామకానికి సంబంధించిన ఫైల్ జెసి దగ్గర ఉందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మార్కాపురం పర్యటన సందర్భంగా జేసీ బిజీగా ఉన్నట్లు తెలిపారు. పవన్ కళ్యాణ్ పర్యటన ముగిసిన వెంటనే జేసీతో మాట్లాడి వార్డెన్‌ను నియమించే కృషి చేస్తామని తెలిపారు.

గదులు సరిపోవడం లేదు

మూరం కాశిరెడ్డి, మాజీ ఎంపిటిసి

30 మందికి సరిపోయే భవనంలో 80 మందిని ఉండమంటే సాధ్యం కాదు. కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలలోని హాస్టల్‌లో భోజనం పెడుతున్నారు. వసతి చూపించలేక పోతున్నారు. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించి నూతన భవనాన్ని వినియోగంలోకి తీసుకొస్తే విద్యార్థునుల కష్టాలు తీరుతాయి.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

మానవత్వం చాటుకున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మానవత్వం చాటుకున్నారు. మార్కాపురంలో అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రి గురువారం బయలు దేరారు. అదే సమయంలో చీమకుర్తి మండలం చీమలమర్రి సమీపంలో బైకు ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను చూసిన మంత్రి తన వాహనాన్ని ఆపి బాధితులను పరా మర్శించారు. అనంతరం చికిత్స కోసం క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు.

వివాదాస్పదంగా మారిన రచ్చబండ స్థలం ఇదే

'రచ్చబండ' పై రగడ

ప్రజాశక్తి-కొండపి

రచ్చబండ స్థలం విషయంలో ఇరువర్గాల గ్రూపుల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఆ స్థలం తమదంటే, తమదంటూ వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన కొండపి మండలం జాళ్లపాలెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం...10 సంవత్సరాల క్రిందట రచ్చ బండ కోసం కేటాయించిన స్థలంలో తాము అరుగును నిర్మించినట్లు ఓ గ్రూపు వారు చెబుతున్నారు. గతంలో వరికూటి అశోక్‌బాబు దగ్గర ఉండి రచ్చ ాఅరుగుకు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. రచ్చబండ తమకు చెందిన స్థలంలో నిర్మించారని, అప్పట్లోనే నిర్మాణాన్ని అడ్డుకున్నట్లు మరో గ్రూపు వారు చెప్పారు. గురువారం జెసిపి సహాయంతో రచ్చ బండను పగలగొట్టే ప్రయత్నం చేశాడు. దీంతో మరో గ్రూపుకు చెందిన మహిళలు అడ్డుకున్నారు. అనంతరం రెండు గ్రూపుల వారు తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి -పొన్నలూరు

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండా బత్తిన మాధవరావు అధ్యక్షతన గురువారం మండల సమావేశం సమావేశం నిర్వహించారు. సమావేశం సాదాసీదాగా సాగింది. సమావేవంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రాబోయేది వర్షాకాలం కాబట్టి గ్రామాల్లోని కాలువల్లో పూడికతీతలు తీయించాలన్నారు. పరిసరాలు పరి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఒ రాము మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుజాత, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దారుగా పుల్లారావు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ఇన్‌ఛార్జి తహశీల్దారు పొన్నలూరు తహోల్దారు పుల్లారావు గురువారం బాధ్యతలు స్వీకరిచారు. గతం ఇక్కడ తహశీల్దారుగా పనిచేస్తున్న టి.రవి ఒంగోలు కలెక్టరేట్ ఎఒగా బదిలీపై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి తహశీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు.

పశుపోషలకు సూచనలు ఇస్తున్న పశువైద్యాధికారి

నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి మండలం కె. బిట్రగుంట గ్రామాన్ని ఐఎస్‌డిపి సహాయ సంచాలకులు డాక్టర్ టి. లావణ్య కుమారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గత నెల 26 నుంచి ఈనెల 10 వరకు గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ జె.శ్రావణి, సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ర్యాలీ

ప్రజాశక్తి-కొండపి

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 గత 75 సంవత్సరాలుగా విద్యుత్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఏపీసీపీడీసీఎల్ 1104 యూనిట్ అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 1104 ప్లాటినం జూబ్లీ వేడుకలుకందుకూరు డివిజన్ పరిధిలోని కొండపి సెక్షన్‌లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1104 యూనిట్ అధ్యక్షుడు రాచగర్ల సంజీవరావు, కందుకూరు డివిజన్ కార్యదర్శులు డి. మనోహర్, కొండపి సెక్షన్ సభ్యులు ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్ వద్ద నుంచి తహశీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు సంజీవరావు చేతుల మీదగా జెండా ఆవిష్కరించారు. కార్యదర్శి నందిగామ శర్మ చేతుల మీదగా శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డిస్కమ్ అధ్యక్షుడు సంజీవరావు ,జిల్లా అధ్యక్షుడు హరికష్ణ , రాష్ట్ర నాయకులు టి.జాన్సన్ , ఎన్.జయకర్ , ప్రాంతీయ నాయకులు ప్రతాప్, బి.సురేష్, మల్లికార్జున్ , మనీష్, రవికాంత్, నరసింహారావు, వహాబ్, రవిశంకర్, కాంతారావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

92 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -కనిగిరి

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లివర్ సమస్యను సకాలంలో గుర్తిస్తే మందులతో వ్యాధిని తగ్గించవచ్చునని డాక్టర్ పివి.రజనీ కాంత్, డాక్టర్ ముక్కు కవిత తెలిపారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో లివర్ వ్యాధులు మార్పిడిపై అవగాహన సదస్సును ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లివర్ మార్పిడి ఇప్పుడు అందుబాటులో ఉందన్నారు. లివర్ సిర్రోసిస్ వస్తే రెండు, మూడు దశలలో లివర్ మార్పిడి చేసుకోవాలన్నారు. సొంత బంధువులు అయితే సగభాగం లివర్ ఇచ్చి కాపాడుకోవచ్చని, జీవన మతుడి(కెడావల్) నుంచి కూడా లివర్ సేకరించి లివర్ మార్పిడి చేసుకోవచ్చని తెలిపారు. కనిగిరి ప్రాంతానికి చెందిన రమణారెడ్డి, నారాయణరెడ్డి లివర్ మార్పిడి చేసుకుని ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు.లివర్ దెబ్బ తినడానికి అధిక మద్యపానం, ఫ్యాటీలివర్, హెపటైటిస్ వైరస్‌లు జన్యుపరమైన కారణాలు అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా 92 మంది వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సలహాలు చేశారు.

విశాంత్ర రికార్డు అస్టిసెంట్ గడిపినేని వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వెంకటేశ్వర్లు (ఫైల్)

శింగరాయకొండ మండలం కలికివాయి గ్రామానికి చెందిన విశ్రాంత రికార్డు అసిస్టెంట్ గడిపినేని వెంకటేశ్వర్లు (జివి.సార్) (75) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఈయన గతంలో శింగరాయకొండ గవర్నమెంట్ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పనిచేశారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల అభివద్ధికి ఎంతో కషి చేశారు. మూలగుంటపాడు లోని విద్యానగర్ 8వ లైన్‌లో శుక్రవారం వెంకటేశ్వర్లు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు గనిపినేని రవిచౌదరి తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్

కార్మిక సమ్మె పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందార్ కోరారు. స్థానిక ప్రజాసంఘాల నాయకులతో కలిసి 'కార్మిక సమ్మె' పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. కార్మికులకున్న కనీస చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, 8గంటల పని విధానాన్ని రద్దుచేసి 10 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. దేశాన్ని అంబానీ, అదానిలకు కట్టబెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నించే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ సార్వత్రిక సమ్మెకు అంగన్‌వాడీలు, ఆశా, పంచాయతీ, ఎల్ఐసి, బ్యాంకు, మధ్యతరగతి ఉద్యోగులు, వివిధ సంస్థల ఉద్యోగులతో పాటు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు మద్దతు తెలుపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాయిని వినోద్ బాబు, సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాడికొండ సుధాకర్ పాల్గొన్నారు.

అద్దంకి : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక కోర్కెల పరిష్కారం కోసం ఈ నెల 9న దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం చర్చా వేదిక నిర్వహించారు. సమ్మె బుక్ లెట్స్ ఆవిష్కరించారు. స్థానిక క్యూర్ అండ్ కేర్ హెూమియో క్లినిక్ నందు కామ్రేడ్ కెఎల్‌డి ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు కె రఘుచంద్, సిఐటియు అధ్యక్షులు పి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కార్మికులు పోరాడి, ఎందరో త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రధాని మోడీ రద్దుచేసి కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ బిల్లులను తీసుకురావటం కార్మికులకు తీరని అన్యాయం చేయటమే అవుతుందని అన్నారు. వెంటనే లేబర్ కోడ్ బిల్లులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోనే చారిత్రాత్మకంగా గుర్తింపు పొందిన రైతు నల్ల చట్టాల వ్యతిరేక ఉద్యమాన్ని ఎలాగైతే నడిచిందో లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని మరొక ఉద్యమాన్ని నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, కెవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

నిబంధనల పేరుతో తిరస్కరణ వద్దు

- రైతులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం కొనాలి
- గిట్టుబాటు అయ్యే ధరలు ఇవ్వాలి
- రైతు సంఘం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పంగులూరు

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల దగ్గర ఉన్న నల్లబర్లి పొగాకు మొత్తం కొనుగోలు చేయాలని, నిబంధనల పేరుతో పొగాకు చెక్కులను వెనక్కి పంపటం మానుకోవాలని, రైతులు తెచ్చిన పొగాకు చెక్కులు మొత్తం ఆలస్యం చేయకుండా కొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నల్లబర్లి కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న ప్రాసెసింగ్, కొనుగోళ్లను పరిశీలించారు. అక్కడున్న రైతులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు అనేక వ్యయ ప్రయాసలకోర్చి పొగాకు చెక్కులు కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే నిబంధనల పేరుతో చెక్కులను వెనక్కి పంపుతున్నారని, మంచి గ్రేడ్ ఉన్న పొగాకు కూడా తక్కువ ధరలు వేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల దగ్గర ఉన్న చివరి ఆకు కొంటామని చెబుతున్నప్పటికీ కొనుగోలు నిబంధనలు మాత్రం రైతుకు మేలు చేసేవిగా లేవని అన్నారు. కొనుగోలు

బయ్యర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

పరిస్థితి చూస్తే ఆ విషయం అర్థం అవుతుందని అన్నారు. రైతులు నాలుగు నెలలుగా తమ పొగాకు కొనుగోలు కోసం ఎదురు చూసి ఇప్పుడు అవకాశం వచ్చిందని ఎంతో ఆశతో తీసుకొస్తే 50శాతంపైగా చెక్కులు ఏదో ఒక సాకు చూపి వెనక్కి పంపిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పొగాకు కొనుగోలును వ్యాపారంగా చూడకూడదని, నాణ్యత తక్కువగా ఉన్న పొగాకు రూ.6వేల రేటు వేయాలని, నాణ్యతగా ఉన్న పొగాకు రూ.12వేల రేటు వేయాలని, తేమ శాతం 20 కన్నా తక్కువగా ఉన్న నాణ్యత లేదనే పేరుతో వెనక్కి పంపుతున్నారని అన్నారు. రైతులు కొంత ఖర్చు పెట్టి గ్రేడ్ చేయించుకుని తీసుకొస్తే, మళ్లీ వాటిని వెనక్కి పంపిస్తున్నారని, మరలా గ్రేట్ చేయాలంటే రైతుకు భారం అవుతుందని అన్నారు. రైతులు నష్టపోకుండా మేలు చేసే విధంగా చూడాలని అన్నారు. పొగాకు నాణ్యతను బట్టి మూడు గ్రేడ్లు చేసినప్పటికీ ధరలు మాత్రం అతి తక్కువగా వేస్తున్నారని అన్నారు. ఈ ధరలు రైతుకు గిట్టుబాటు కావని అన్నారు. రైతును అప్పుల పాలు చేసే విధంగా ధరలు ఉన్నాయని ఆరోపించారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రానికి వచ్చిన చెక్కుల్లో సుమారు 100కు పైగా నిబంధనలు పేరుతో వెనక్కి పంపుతారని అన్నారు. మార్టూరు మండలం రాజుపాలెంకు చెందిన రావెళ్ల ఉమామహేశ్వరరావు 20 చెక్కులు తీసుకొస్తే 8 చెక్కులు, అదే గ్రామానికి చెందిన మాదాల సాంబశివరావు 20చెక్కులు తీసుకొస్తే 9 చెక్కులు, పంగులూరు మండలం బూదవాడకు చెందిన ఈమని సుబ్బారెడ్డి 20 చెక్కులు తీసుకొస్తే 11 చెక్కులు, జనకవరంకు చెందిన చుక్క కాంతయ్య 21 చెక్కులు తీసుకొస్తే 7 చెక్కులు కొని 14 చెక్కులు వెనక్కి పంపాలని పేర్కొన్నారు. అనంతరం బయ్యర్ మారెళ్ళ శ్రీధర్‌తో రైతు నాయకులు మాట్లాడారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, రైతులకు ఉపయోగపడే విధంగా కొనుగోలు చేయాలని ఆయనను కోరారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి కొంత శాంపిల్ పొగాకు తీసుకువచ్చి, నిబంధనల పేరుతో రైతుల చెక్కులను ఎక్కువగా వెనక్కి పంపుతున్నారని, అనేక మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో రైతులు గుడిపాటి మల్లారెడ్డి, తానికొండ సుధాకర్, తలపనేని స్వామి, రావెళ్ల ఉమామహేశ్వరరావు, చుక్క కాంతయ్య, మాదాల సాంబశివరావు, ఈమని సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపల్లె నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - రేపల్లె

స్వర్ణ ఆంధ్ర విజన్ 2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన చేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అధికారులకు సూచించారు. స్థానిక ఎబిఆర్ డిగ్రీ కళాశాలలో యాక్షన్ ప్లాన్ గురువారం ఆవిష్కరించారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 100 ఏళ్లు పూర్తి చేసుకునే 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అద్భుత రాష్ట్రంగా తీర్చిదిద్దటమే విజన్ 2047 ఉద్దేశ్యమని అన్నారు. 1995లో ఉమ్మడి ఎపి సిఎంగా చంద్రబాబు విజన్ 2020తో అద్భుతమైన ప్రగతిని అందించారని గుర్తు చేశారు. నేడు విజన్ 2047 రాష్ట్రంతో పాటు నియోజకవర్గాన్ని ఆదర్శవం తంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. నిజాంపట్నంలో ఏర్పాటు చేయనున్న ఆక్వా పార్కుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడ తాయని అన్నారు. నిజాంపట్నం, గుంటూరు రహదారి నిర్మాణంతో టూరిజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రతి గ్రామంలో రహదారుల అనుసంధానం, సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీరు, విద్య, వైద్యం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. స్థానిక ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను 100 పడకల ఆసుపత్రి

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

గా తీర్చిదిద్దడంతో పాటు డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా, సుస్థిరమైన పర్యావరణ పరంగా సైన్స్ అండ్ టెక్నాలజీలో అభివృద్ధి సాధించడం విజన్ లక్ష్యం అన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధితో పాటు, డిజిటల్ ఆంధ్ర ప్రదేశ్ పైపు అడుగులేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవతో పనిచేయాలని సూచించారు. పి4 పథకం ద్వారా బంగారు కుటుంబాలను ఆదరిస్తున్న వైద్యులు డాక్టర్ ఎంవి సుబ్బారావును అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీఒ రామలక్ష్మి, డిఎస్‌పి ఆవుల శ్రీనివాసరావు, కృష్ణ, పశ్చిమ డెంట ప్రాజెక్టు చైర్మన్ మురళీధరరావు, ప్రిన్సిపల్ రవిచంద్ర కుమార్ పాల్గొన్నారు.

టిడిపి నూతన కార్యవర్గంతో ఆనందబాబు

టిడిపి నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - వేమూరు

తెలుగు దేశం మండల నూతన కార్యవర్గ సభ్యులను శాసన సభ్యులు నక్కా ఆనందబాబు గురువారం నియమించారు. మండల నూతన అధ్యక్షులు గాజుల వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షులు పోకూరి మీరా వర్ధని, ప్రధాన కార్యదర్శి వేల్పుల రవి ప్రసాద్, కార్యనిర్వహణ కార్యదర్శులు గోగి అంకమ్మరావు, గోపాలం సుబ్బారావు, పెదన కమాలాకర రావు, కార్యదర్శులు దాసరి వెంకటేశ్వర రావు, షేక్ షరీఫ్, గాడిబోయిన రాజా, కోశాధికారి కోగంటి సుధీర్‌ను ఎంపిక చేశారు. తెలుగు యువత అధ్యక్షులు ఈపూరి రమేష్, తెలుగు రైతు అధ్యక్షులు దండే శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నల్లూరి బుజ్జి, ఎస్‌టి సెల్ అధ్యక్షులు మణికాల సుధాకర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కమారి, నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - రేపల్లె

సిఐటియూ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ గత 15 రోజులుగా వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం ధోరణికి నిరసనగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు జులై 4న చలో విజయవాడకు తరలి రావాలని కోరారు. ప్రభుత్వం స్పందిచకపోతే మంచి నీళ్ళ, విద్యుత్తు వంటి విధులు నిర్వహిస్తున్న కార్మికులు కూడా నిరవధిక సమ్మెలోకి వెళ్లి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, జిఒ నెంబర్ 36 ప్రకారం రూ.24,500 వేతనం అమలు చేయాలని, తక్షణం తల్లికివందనం ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. గతేడాది 17 రోజుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని అన్నారు. యూనియన్ పట్టణ అధ్యక్షులు డి ప్రభాకరరావు, కార్యదర్శి ఎన్ రవిబాబు, కోశాధికారి కె రాఘవేంద్రరావు, యువరాజు, రవి, ప్రభాకర్, అనుష, గీత పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో బలహీన వర్గ ప్రజల నివాస ప్రాంతమైన కొణిజేటి చేనేత పూరిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల్లోని 80 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ చీరాల శాసన సభ్యునిగా కొనిజేటి రోశయ్య ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా, తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య చేసిన సేవలు ఎన్నటికీ ప్రజలు మర్చిపోరని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరిశ్రమించిన శ్రామికుడు రోశయ్యని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి ఉభయ తెలుగు రాష్ట్రాలు ప్రభుత్వ కార్యక్రమంగా ఆయన జయంతిని జరుపుకోవడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. రోశయ్య శాసన సభ్యునిగా ఉన్న సమయంలోనే పట్టభద్రుల సంఘాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఆయన జయంతిని పాఠశాల చిన్నారుల మధ్య జరుపుకోవటం సంతోషాన్నిచ్చిందని అన్నారు. నాగరాజ్, సంయుక్త కార్యదర్శి నాగాంజనేయులు, శివప్ర సాద్, శరత్ బాబు, చేనేతపురి హెచ్‌ఎం లక్ష్మయ్య పాల్గొన్నారు.

సదరం స్లాట్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించిందని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు గురువారం తెలిపారు. ఈ బుకింగ్ అవకాశాన్ని ప్రభుత్వం కేవలం రెండు రోజులు మాత్రమే అందుబాటులో ఉంచిందని అన్నారు. జూలై 5, 6 తేదీల్లో మాత్రమే స్క్రీనింగ్ స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 3 నుంచి సెప్టెంబర్ 30వరకు ఆయా తేదీల్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ఆధార్, హెల్త్ కార్డ్ తీసుకొని సమీపంలోని మీసేవ, గ్రామ సచివాలయాల్లో సదరం క్యాంపు ఫ్లాట్లు బుక్ చేసుకోవాలని తెలిపారు. ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకున్నవారికి మాత్రమే స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారని తెలిపారు. ఎంచుకున్న ఆస్పత్రిలో మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశం దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సార్వత్రిక సమ్మెలో

షాపింగ్ మాల్స్ కార్మికులు పాల్గొనాలి

సిఐటియు ప్రచారం

సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు విజ్ఞప్తి చేసింది. గురువారం నాడు సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని చెన్నై షాపింగ్ మాల్, సీఎంఆర్, లక్కీ షాపింగ్, సౌత్ ఇండియా, శుభమస్తు, అంబిక ,జోడియో తదితర షాపింగ్ మాల్స్ యాజమాన్యం, మేనేజర్లకు సమ్మె కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం స్వదేశీ, విదేశీ పెట్టుబడి దారుల ప్రయోజనం కోసం కార్మిక చట్టాలను రద్దు చేసిందని పేర్కొన్నారు. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ ప్రవేశపెట్టిందని, కార్మికుల హక్కులు కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ 26,000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొనాలని కోరారు. చట్టప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వసంస్థలను ప్రైవేటీకరించరాదని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్స్, ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు పాల్గొంటున్నారని తెలిపారు. సమ్మెను జయప్రదం చేయడానికి నగరం లోని షాపింగ్ మాల్స్ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి. మహేష్, నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఏడాదిలోనే గాడిన పెట్టాం

- అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లు
- మంత్రి బాలవీరాంజనేయస్వామి

కరపత్రాలు అందజేస్తున్న మాగుంట, సత్య, స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి ఆలోచన రాష్ట్ర ప్రజల కోసమేనని, వైసీపీ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఏడాదిలోనే గాడిన పెట్టామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు జరుగుమల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం మంత్రి స్వామి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి ఆలోచన ఈ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివద్ధి కోసమేనని 70 పదుల వయసులో కూడా 20 ఏళ్ల యువకుడిలా పని చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ దెబ్బతిని ఆర్థిక వ్యవస్థకి గండి పడిందని, ఆర్థిక గండిని పూడుస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ చంద్రబాబు కష్టపడి పని చేస్తున్నారన్నారు. అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారన్నారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూ మరోవైపు కంపెనీలను, నూతన పెట్టుబడులను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతి జాతి తలరాతలు మార్చే పోలవరాన్ని నిర్మిస్తూ నవ శకానికి దారులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి కొండపి నియోజకవర్గ అబ్జర్వర్ అడకా స్వాములు, జరుగుమల్లి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, జరుగుమల్లి ఎంపిపి బెల్లం నిర్మల సత్యన్నారయణ, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, టిడిపి నాయకులు పోటు శ్రీనివాసమురళి, మక్కెన వెంకటరావు, దగ్గుమాటి సుబ్బారెడ్డి, కొండూరి శివకోటిరెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, భారీగా మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5న రైతు సెమినార్

మాట్లాడుతున్న జయంతిబాబు, వెంకట్రావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'కార్పొరేటీకరణ వ్యవసాయ రంగంపై ప్రభావం' అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 5న రైతు సెమినార్ జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయంతిబాబు, పమిడి వెంకట్రావు గురువారం తెలిపారు. ఒంగోలులోని ఉత్తర బైపాస్ జంక్షన్ వద్ద గల బందావన్ కళ్యాణమండపంలో జరిగే ఈ సెమినార్‌లో ఏఐకేఎస్ ఉపాధ్యక్షుడు మరియు లోకసభ సభ్యుడు ఆమ్రరామ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. వారితో పాటు సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వర రావు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య కె.ప్రభాకర్‌రెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పాల్గొంటారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ఈ సెమినార్‌లో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. కావున జిల్లాలోని రైతాంగం ఈ సెమినార్‌లో విరివిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పొందూరులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-టంగుటూరు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒంగోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఎ.లీనా సిబ్బందితో టంగుటూరు మండలం, పొందూరులో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లీనా మాట్లాడుతూ పొందూరులో ఎవరూ అనధికారికంగా మద్యం గానీ, గంజాయి గానీ సేవించటం లేదన్నారు. మద్యం గొలుసు దుకాణాలు గురించి తనిఖీలు చేశామని, గొలుసు దుకాణాలు లేవని చెప్పారు. మాదక ద్రవ్యాలు, అనధికార మద్యం నిల్వలు, విక్రయాలపై ఎవరికైనా తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏపీ రజక వృత్తిదారుల సంఘం పిలుపు

మాట్లాడుతున్న రాము

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఈ నెల 9 న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఒంగోలు నగర అపార్ట్మెంట్ కం ఇస్త్రీదారుల సంఘం కమిటీ పిలుపు నిచ్చింది. గురువారం ఒంగోలు ఎల్బీజీ భవన్ లో రజక వృత్తిదారుల సంఘం అపార్ట్మెంట్ కమ్ ఇస్త్రీదారుల సంఘం సంయుక్తంగా ఆఫీస్ బేరర్ల సంయుక్త సమావేశం జరిగింది. రాచకొండ వెంకటకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా రజక వత్తిదారుల సంఘం అధ్యక్షులు టంగుటూరు రాము, సంఘ జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య, అపార్ట్మెంట్ వాచ్మెన్ కం ఇస్త్రీదారుల సంఘం ప్రధాన కార్యదర్శి మంచికలపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ కమిటీ సభ్యులు ఆవుల మంద రమణమ్మ, జిల్లా సంఘాల సంయుక్త కమిటి సభ్యులు ఏడుకొండలు, మిరియం వెంకటేశ్వర్లు, రఘుబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-టంగుటూరు

వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

టంగుటూరులోని సింహపురి ఎక్స్‌ప్రెస్ వే టోల్‌గేట్ రెండో వార్షి కోత్సవం సందర్భంగా టోల్‌గేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రత, సంక్షేమా నికి కృషి చేస్తామని అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కెవిఎస్ఆర్ మూర్తి తెలి పారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ వే టోల్‌గేట్, టంగుటూరు కార్యాలయంలో గత రెండు రోజులుగా వార్షికోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ హెడ్ జైరామ్ అమర్‌బాబు మాట్లాడుతూ జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు అన్ని సౌకర్యాలు, టోల్‌గేట్ దగ్గర ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదేనని చెప్పారు. కార్యక్రమంలో సింహపురి ఎక్స్‌ప్రెస్ వే టంగుటూరు టోల్‌గేట్ మేనేజర్ నాగేశ్వరరావు, నరసింహారావు, ఆపరేషన్ మేనేజర్ ఆనంద్ సింగ్, సేఫ్టీ ఆఫీసర్ ఎస్‌కె భాసీత్ పాల్గొన్నారు.

లైసెన్స్ దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాలి

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుండి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం జిల్లా ప్రజలను కోరారు. లైసెన్స్ లేని వ్యక్తుల (అనధికార వ్యక్తుల) వద్ద నుండి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అటువంటి మద్యం నకిలీది కావచ్చని ఆమె తెలియజేశారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యాన్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పేవారు ప్రజలను మోసం చేసే అవకాశం ఉందన్నారు. వారు సరఫరా చేసి నకిలీ మద్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన హానిని కలిగించవచ్చన్నారు. కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారి తీస్తుందని ఆమె తెలిపారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను టోల్ ఫ్రీ నంబర్: 14405 లేదా ప్రకాశం జిల్లా, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి మొబైల్ నెంబర్ 9440902491 నెంబర్‌కి తెలియజేయాలన్నారు.

మహిళా ఎక్సైజ్ సిఐని దూషించిన

ఎస్ఐ సైమన్ సస్పెన్షన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పొదిలి ఎక్సైజ్ సిఐ తాళ్లూరి అరుణకుమారిని అసభ్య పదజాలంతో దూషించిన ఎక్సైజ్ ఎస్ఐ సైమన్‌ను గుంటూరు డిప్యూటీ కమిషనర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం సిఐ పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఎస్సై సైమన్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఈసి ఎస్ ఆయేషాబేగంకు మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు అర్జీ ఇచ్చి కోరారు. ఈ సమాచారాన్ని ఈసి గుంటూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దష్టికి తీసుకువెళ్లడంతో ఇద్దరు అధికారులను నియమించి సైమన్‌పై పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. ఎక్సైజ్ ఎస్ఐ సైమన్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

దళిత మహిళా సిఐ పట్ల అసభ్యప్రవర్తన, కుల దూషణకు పాల్పడిన సైమన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంలో కేసు నమోదు చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

ఒకరికి ఒక్క ఓటే..

- ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి
- రాజకీయ పార్టీలకు ఆర్డీవో లక్ష్మీప్రసన్న సూచన

మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రతి ఓటరూ ఒక్క ఓటు మాత్రమే కలిగి ఉండాలని ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న సూచించారు. ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలో ఒంగోలు నియోజకవర్గ రాజకీయపార్టీల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు ప్రకారం దేశం ఏ పౌరుడికైనా ఒక చోట ఒక ఓటు మాత్రమే ఉండాలనే నిబంధన ఏర్పాటు చేసిందన్నారు. కొంతమంది రెండు, మూడు చోట్ల ఓట్లు కలిగి ఉన్నారని, ఈ విధంగా ఉండటం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇలా ఉన్న వారు ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూసుకోవాలన్నారు. లేకపోతే ఆధార్ అనుసంధానంతో ఓట్లు తొలగిస్తారన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు వెంటనే అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని ఓట్లను తొలగిస్తామన్నారు.వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో రెండు, మూడు ఓట్లు కలిగిన వారు హైదరాబాద్, తెలంగాణ చెన్నై, రాష్ట్రాలలో ఉన్నారని, ఒంగోలు నియోజకవర్గం చుట్టూ ఉన్న నియోజకవర్గంలో ఉన్నారన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని డివిజన్, గ్రామాలలో రెండు, మూడు చోట్ల ఓట్లు కలిగిన వాళ్లు 30 నుండి 35 వేలకు పైగా ఉన్నారన్నారు. ఈ విషయం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, సరిచేయాలని కోరారు. సమావేశంలో ఒంగోలు తహశీల్దార్ పి.మధుసూదనరావు, ఒంగోలు కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుధాకరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.బాబురావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి స్వరూప్, కాంగ్రెస్ ప్రతినిధి ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి గుర్రం సత్యం, ఒంగోలు డిటి సలోమి, పద్మజ నాయుడు, సాయి, దాసు, మంజు, దేవరాజు పాల్గొన్నారు.

ఆస్తుల ముందు మానవత్వమెక్కడ..!

- మూడురోజులగా ఇంటివద్దనే మృతదేహం
- పోలీసు స్టేషన్‌కు చేరిన 'శవ పంచాయితీ'

ప్రజాశక్తి - పంగులూరు

మానవత్వం మంట గలిచింది. ఆస్తిపాస్తులకు ఉన్న విలువ మనిషికి లేదని మరోసారి నిరూపితమైంది. ఆస్తుల కోసం మృతదేహాన్ని ఇంటి ముందు పెట్టుకుని రచ్చ చేసుకుని, కనీసం మృతదేహానికి అంత్యక్రియలు కూడా చేయకుండా కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, సన్నిహితులు ఆస్తివివాదంలో పడిపోయి శవ పంచాయతీలకే విలువనిచ్చారు. మృతదేహాన్ని ఇంటి దగ్గర పెట్టి, ఆస్తి పంచాయతీ కోసం పోలీసు స్టేషన్లకు వెళ్లిన సంఘటన గ్రామస్థులను కలచివేస్తుంది. ఆస్తులు తప్ప, రక్త సంబంధాలు, బాంధవ్యాలు, అనుబంధాలు ఏమీ లేవని ఈ సంఘటన గుర్తు చేస్తుంది. మండలంలోని రామకూరు గ్రామానికి చెందిన ఎర్రిబోయిన సురేష్ వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అతనిని వైద్యం కోసం మొదట చిలకలూరిపేట, తరువాత కాటూరి వైద్యశాలకు తరలించగా వైద్య చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు మంగళవారం మధ్యాహ్నంకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం అతని అంత్యక్రియలకు భార్య తోపాటు, భార్య తరపు బంధువులు అడ్డుకున్నారు. మృతి చెందిన సురేష్ తండ్రి అంజయ్య ఆస్తులు పంపకం జరపలేదని, ఆస్తి పంచి సురేష్ భార్య తిరుపతమ్మకు, ఆమె పిల్లలకు ఆస్తి రాసే వరకు మృతదేహాన్ని కదిలించ దానికి వీల్లేదని బంధువులు పట్టుదలతో భీష్మించుకొని కూర్చోవడంతో మృతుడు సురేష్ అంత్యక్రియలు నిలిచిపోయాయి. బుధవారం జరగవలసిన అంత్యక్రియలు గురువారం సాయంత్రం వరకు జరగలేదు. మృతుడు సురేష్ తండ్రి అంజయ్యకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలు అయిపోయాయి. మనుమలు, మనమరాలు కూడా పెద్దవారయ్యారు. అయితే వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ అంజయ్య కుమారులకు ఆస్తి పంచేందుకు అంగీకరించలేదు. దీంతో గత రెండు రోజులుగా కుటుంబ సభ్యులకు, బంధువులకు మధ్య వాగ్వివాదాలు గొడవలు జరిగాయి. చివరికి గురువారం మధ్యాహ్నం రేణింగవరం పోలీసు స్టేషన్‌కు పంచాయతీ చేరింది. అక్కడ ఎస్ఐ వినోద్ బాబు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ చేసేందుకు చేసిన ప్రయత్నాలు సాయంత్రం 3గంటల ప్రాంతంలో ఫలించాయి. మొత్తానికి ఆస్తి పంపకాలు విషయమై నిర్వహించిన పంచాయితీ పూర్తయింది. పోలీసు స్టేషన్ దగ్గరే ఆస్తులు విషయమై రాతకోతలు చేసుకొని బంధువులు, కుటుంబ సభ్యులు రామకూరు చేరారు. అయితే సాయంత్రం ఐదు గంటల వరకు మృతదేహానికి అంత్యక్రియలు జరగలేదని సమాచారం. ఏదేమైనా మనుషుల కన్నా ఆస్తులకే ఈ సమాజంలో విలువ ఉంటుందని చెప్పుకోడానికి ఈ ఘటన ఒక ఉదాహరణ. ఆస్తులు పంచకుండా తమ దగ్గరే ఉంచుకొని, వృద్ధాప్యంలో కూడా తన పెత్తనమే చెల్లాలని, ఒక వ్యక్తి చేసిన ప్రయత్నానికి ఒక కుటుంబంలోని నాలుగు ప్రాణాలు బలైపోయిన విషయం కూడా రామకూరు గ్రామంలోనే జరిగింది. ఇప్పుడు ఆస్తి కోసం జరిగిన పోరాటంలో శవానికి అంత్యక్రియలు కూడా నిర్వహించకుండా పోలీసు స్టేషన్‌కు వెళ్లిన సంఘటన ఆ గ్రామ ప్రజలను కలిసివేస్తుంది.

సురేష్ మృతదేహం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : అనగాని

మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

కరపత్రాలు అందజేస్తున్న ఆనందబాబు

ప్రజాశక్తి - నగరం

సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ తెలుగు దేశం మండలంలోని సజ్జావారిపాలెంలో గురువారం నిర్వహించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 365రోజుల్లో తమ ప్రభుత్వం చేసిన 365 మంచి పనులను ప్రజలకు వివరించారు. ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు.

బాపట్ల : ప్రజా సంక్షేమమే సుపరిపాలనకు తోలి అడుగని శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అన్నారు. తమ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని 14, 13 వార్డుల్లో ఆయన 'సుపరిపాలనలో తొలి అడుగు – ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో తాతా జయప్రకాశ్ నారాయణ, గొలపల శ్రీనివాసరావు, నర్రా వీరాంజనేయులు, ప్రెసిడెంట్ బోయిన సాంబయ్య,క్లస్టర్ పాల్గొన్నారు.

వేమూరు : తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసినట్లు శాసన సభ్యులు నక్క ఆనందబాబు తెలిపారు. ఏడాది పాలనపై గురువారం పట్టణంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి గంగాధర్, తెలుగుదేశం నాయకులు జొన్నలగడ్డ విజయబాబు పాల్గొన్నారు.

చీరాల : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే తెలుగుదేశం లక్ష్యమని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమయ్యేలా ప్రారంభించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మండలంలోని రామకృష్ణాపురంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధన్, టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, రామకృష్ణాపురం అధ్యక్షులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నరేంద్ర వర్మ

మగ్గాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

బడి బయటి విద్యార్థులకు పాఠశాల ప్రవేశం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంలో ఎంఇఒ నీలం దేవరాజ్ ఆధ్వర్యంలో గురువారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో బడి బయట ఉన్న నలుగురు బడి ఈడు పిల్లలను తల్లి, దండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను గుర్తించి ప్రతి గ్రామంలో నుండి వారిని దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత కనబడుతుందని చెప్పారు. దీని దృష్ట్యా ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాల వైపు దృష్టిసారించాలని అన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల తోపాటు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఐలవరంలో బడి బయట ఉన్న విద్యార్థులు కొమరాబత్తుని బసవమ్మ 4వ తరగతి, కంభం లలిత 6వ తరగతి, పప్పుల నిహార్ 7వ తరగతి, పప్పుల మిన్ను ఓపెన్ టెన్త్ క్లాస్‌లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఉపాధ్యాయులు మాచర్ల మోహనరావు, సిఆర్ఎం టిఎస్‌లో కె సలోమి, కె కృష్ణారావు, రాజ్యలక్ష్మి, లక్ష్మి వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రగతి, భువన, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని గురిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెం గ్రామానికి చెందిన గద్దె విజయకుమార్ (22) అను యువకుడు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని కారు ఢీకొని మృతి చెందాడు. ఒలేరు గ్రామం నుండి జాతీయ రహదారి 216పైగా రేపల్లె వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఆ సమయంలో భట్టిప్రోలు నుండి పెనుమూడి వైపు వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగ్రాత్రుని తలకు, శరీరంపై బలమైన గాయాలు అయ్యాయి. దీంతో రేపల్లె ప్రభుత్వ శాలకు చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం శివయ్య తెలిపారు.

నేడు కామేపల్లిలో మంత్రి పర్యటన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కామేపల్లిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటిస్తారని సర్పంచి గుండపునేని విజయలక్ష్మి తెలిపారు. గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం, అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం కరపత్రాలు పంపిణీలో పాల్గొంటారని తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పేరుకుపోయిన పారిశుధ్య పనులు వెంటనే చేపట్టాలని ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో రహదారుల వెంట ఆనుకుని ఉన్న పేడ దిబ్బలు తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో శివరాం ప్రసాద్, పంచాయతీ గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి ముండ్లమూరు

ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం క్రింద ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలకు భీమా చేసుకోవాలని ఎఒ ఎ తిరుమలరావు తెలిపారు. పత్తి పంటను వాతావరణ ఆధారిత పంటల భీమా పథకం క్రింద ప్రకటించారని చెప్పారు. రైతులు తమ ఆధార్, పొలం పాసు పుస్తకం లేదా కౌలుదారు కార్డు, పంట సాగు ధృవీకరణ పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం జెరాక్సులతో దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పంటల భీమా చెల్లించుకోవచ్చుని తెలిపారు. పత్తి పంటకు జూలై 15, వరి పంటకు ఆగస్టు 15, మిగిలిన పంటలకు జూలై 31న ఆఖరి తేదీలుగా ప్రకటించారని తెలిపారు.

పిడితో మాట్లాడుతున్న సాల్మన్

పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి - అద్దంకి

సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గించాలని డిఆర్డిఎ అధ్యక్షులు సాల్మన్ అన్నారు. డిఆర్డిఎ వెలుగు కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు ఉద్యోగుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు సాల్మన్ సిబ్బంది సమస్యల గురించి పిడితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్యలపై ప్రతి రెండు నెలలకు ఒకసారి గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. గూగుల్ మీట్ కార్యాలయ పని గంటల్లోనే ఏర్పాటు చేయాలని కోరారు. కొత్త రకాల పనులు, యాప్‌లు వచ్చినప్పుడు అవగాహన కార్యక్రమాలు సిబ్బందికి కల్పించాలని డిమాండ్ చేశారు. పేర య్య, బ్రహ్మయ్య, ప్రసాదు, రాజారావు, మాణిక్యరావు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ తహశీల్దారు శాంతి లక్ష్మి

ఘనంగా డిటి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహశీల్దారు కార్యాలయ డిటి అనగానీ శాంతిలక్ష్మి పుట్టినరోజు వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, నాయకులు గ్రామ సర్వేయర్లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మరిన్ని పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు మేకా శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, ఎఒ జలజ, ఆర్ఐ ఫణి కుమార్, విఆర్ఓలు, కార్యాలయ సిబ్బంది, గ్రామ సర్వేయర్లు, మాజీ ఎంపిపి వాకాసుధ శేషుబాబు, ఎఎంసి డైరెక్టర్ వెంకటేశ్వరరావు, నాయకులు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, నూతక్కి దినకర బాబు, వేములపల్లి జగన్నాథరావు, రాయన ప్రసాదరావు, శివ, తూనుగుంట్ల సాయిబాబా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గించాలి

ప్రజాశక్తి - పర్చూరు

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని ప్రతి ఒక్కరూ తగ్గించాలని ఉప్పుటూరు హెూమియో డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం ఉప్పుటూరులో రోడ్డు మీద ఉన్న షాపు వద్ద జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వద్దు – ఆరోగ్యమే ముద్దని వినూత్న ప్రదర్శన చేశారు. ప్లాస్టిక్ వల్లే మనుషుల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. క్యాన్సర్లు, స్త్రీ, పురుష ప్రత్యుత్పత్తి సమస్యలు వస్తున్నాయని, జంతు జాలాన్ని కూడా చిక్కుల్లో పెడుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణం కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ శృతి, ఆశ కార్యకర్తలు, అధ్యాపకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయాలి

ప్రజాశక్తి - కర్లపాలెం

మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు వేయించాలని తెనాలి డిడి డాక్టర్ పద్మావతి అన్నారు. మండలంలోని బుద్దాం, యాజలి గ్రామాల్లోని మేకలు, గొర్రెల కోసం పెంపకం దారులకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు. శిబిరంను ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ తహ అన్సారీ 1500 గొర్రెలు, మేకలకు నట్టల మందు ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్ఎస్ ఎ రాజేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణంలో నాణ్యతా లోపం

నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రూ.కోట్ల నిధులు వెచ్చించి పది కాలాలపాటు పదిలంగా ఉండాలన్న దృక్పథంతో నిర్మిస్తున్న వంతెనలు కాంట్రాక్టర్ల కక్కుర్తి, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా నాసిరకంగా తయారవుతున్నాయి. భట్టిప్రోలులో చిన్న పులివర్రు వెళ్లే వెల్లటూరు ఛానల్‌పై రైల్వే వంతెన వద్ద నూతనంగా రూ. 1.40 కోట్ల వ్యయంతో వంతెన, రహదారి నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ వంతె నిర్మాణ పనులకు వినియోగించే సిమెంటు నాసిరకంగా ఉంటూ గడ్డలు కట్టి రాళ్ల లాగా మారిపోయాయి. ఇలాంటి సిమెంటును గుత్తే దారులు వంతెన కాంక్రీట్ పనులకు వినియోగిస్తున్నారు. గడ్డలు కట్టిన సిమెంట్‌లో ఎలాంటి పటుత్వం ఉండదని, ఈ సిమెంట్ వాడటం వలన నాణ్యత లోపించి వంతెన త్వరలోనే పగుళ్లకు గురై దెబ్బతినే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఇదే ప్రాంతంలోని గేటును మూసి వేసేందుకు ఐదేళ్ల క్రితం రూ. 2కోట్లకుపైగా ఖర్చు చేసి అండర్ టెన్నల్ నిర్మించారు. డెల్టా ప్రాంతం కావడంతో నిత్యం ఈ టన్నెల్ కింద నీరు నిలబడి ఉండటంతో రైతులకు ఇబ్బందికరంగా మారి రాకపోకలు లేకుండా నిరుపయోగంగా మారింది. దీంతో చేసేదేమీ లేక రైల్వే శాఖ మరోసారి విధులు కేటాయించి వెల్లటూరు ఛానల్‌పై వంతెన నిర్మించి దానికి అనుగుణంగా వెల్లటూరు రహదారి మార్గంలో రైల్వే గేటు నుండి వంతెన వరకు రైల్వే స్థలంలో రహదారిని కూడా నిర్మిస్తున్నారు. ఈ వంతెనపై రైతులు పంట ఉత్పత్తులు, ఎండు గడ్డి వంటి వాటిని తరలించుకోవాల్సి ఉంది. వంతెన, రహదారి నిర్మాణం పూర్తి కాగానే ఈ ప్రాంతంలోని రైల్వే గేటును శాశ్వతంగా మూసివేస్తారు. ఇంత పెద్ద ఎత్తున పనులు జరుగుతున్న ప్రాంతంలో సంబంధిత అధికారులు ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. దీని కారణంగా గుత్తేదారు తనిష్టాను సారంగా వ్యవహరిస్తూ గడ్డలు కట్టిన సిమెంటును కాంక్రీట్ పనులకు వినియోగించడం పట్ల రైతులు, ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం పనులతో పొంచి ఉన్న ప్రమాదం

టన్నుల కొద్ది బరువులను తరలించే ప్రాధాన్యత కలిగిన ఈ వంతెన నాసిరకంగా నిర్మిస్తే భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్లతో నిర్మించిన అండర్ టెన్నల్ నిరుపయోగం కాగా నిర్మించే వంతెన కూడా నాసిరకంగా నిర్మిస్తున్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం పట్ల రైతులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని జరుగుతున్న పనులపై పర్యవేక్షణ చేపట్టి నాణ్యతా ప్రమాణాలతో పనులు జరిగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణ ప్రాంతంలో గడ్డలు కట్టిన సిమెంట్ కట్టలు

పచ్చళ్ల కొనుగోళ్లలో జాగ్రత్తలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ప్రజలు లేబుల్స్ లేని పచ్చళ్ళ కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార భద్రత జిల్లా అధికారి కె దేవరాజు అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు ఆయన మండలంలోని కనగాలలో దుకాణాన్ని సందర్శించారు. భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన వ్యాపారి గోలి బాలకృష్ణ నుండి కొనుగోలు చేసిన ఐదు రకాల 250 గ్రాముల పచ్చళ్ళ డబ్బాలు నాసిరకంగా ఉన్నాయని కనగాలకు చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశాడు. దుకాణంలోని పచ్చడి డబ్బాల నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నామని దేవరాజు తెలిపారు. ఐలవరంలోని రామకృష్ణ ఇంటికి వెళ్లి నమూన సేకరించామని హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపి రిపోర్టుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పచ్చళ్ళు, ఇతర ఆహార పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో లేబుల్స్, సరైన వివరాలు లేని ఆహార పదార్థాల డబ్బాలు, ప్యాకెట్లు కొనుగోలు చేయవద్దని సూచించారు. అలాంటివి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమగ్ర ఆరోగ్య శిబిరాల నిర్వహణ

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో పెద్ద ఎత్తున సమగ్ర ఆరోగ్య శిభిరాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ వైద్యాధికారులకు సూచించారు. జిల్లాలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్ (ఐహెచ్‌సి) కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను వైద్యాధికారులతో కలిసి ఆమె గురువారం ఆవిష్కరించారు. లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి ఎస్‌కె ఎండి సాధిక్ మాట్లాడుతూ ప్రధానంగా వెనుకబడిన సముదాయాల లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జానీ భాష, డిపిఒ ప్రేమ పావని, బాపట్ల ఐసిటిసి, పిపిటిసిటి, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

5న మండల సమావేశం

ప్రజాశక్తి - కారంచేడు

మండల ప్రజా పరిషత్ సర్వసభ సమావేశం ఈనెల 5న జరుగుతుందని ఎంపిడిఒ కె నేతాజీ గురువారం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష చేస్తామని తెలిపారు. సభ్యులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ విఫలంపై వైసిపి ప్రచారం

.ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని పావులూరులో నియోజకవర్గ స్థాయి సమావేశం ఈనెల 5న జరుగుతుందని వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి తెలిపారు. సమావేశానికి వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు హాజరవుతారని తెలిపారు.

బాపట్ల సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి స్వర్ణాంధ్ర లక్ష్యంగా అధికారులు సమర్ధవంతమైన పరిపాలన అందించాలని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. బాపట్ల అభివృద్ధి అంశంపై అధికారులతో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి ఆర్డిఓ పి గ్లోరియా అధ్యక్షత వహించారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. బాపట్ల, సూర్యలంక సముద్ర తీరం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే రూ. 4కోట్లు మేర యేడాదికి ఆదాయం వస్తుందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అమలు జరుగుతున్న పనులపై ఆరా తీశారు. పట్టణంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచన చేశారు. తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచాలని అన్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలు మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ రఘునాథరెడ్డి, తహాశీల్దారు షేక్ షలీమ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

దోమల నిర్మూలనతో డెంగ్యూ నివారణ

ప్రజాశక్తి - బాపట్ల

దోమకాటు, ఇతరకీటకాల ద్వారా సంక్రమించే వ్యాధులను అంతం చేయడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య సిబ్బంది తమ వంతు కర్తవ్యం నిర్వర్తించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ పేర్కొన్నారు. డెంగ్యూ మాసో త్సవంలో భాగంగా కీటక జనిత వ్యాధులను అంతం చేద్దాం అనే నినాదంతో ఆరోగ్య సిబ్బంది గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఖదీర్, షకీల్, రాంబాబు, జిలాని, కూరపాటి సత్యంరాజు పాల్గొన్నారు.

వైసిపి నాయకులు శంకరరావుకు నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరంకు చెందిన వైసిపి నాయకులు తాతా శంకరరావు (52) ఇటీవల అనారోగ్య సమస్యతో మృతి చెందారు. ఆయన సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. సభకు వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు హాజరై శంకరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి -కారంచేడు

రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు, ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ ఖాదర్ భాష గురువారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని చెప్పారు. దీనివలన వాహనదారుల కుటుంబ సభ్యులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. లైసెన్సులు లేకుండా డ్రైవింగ్ చేయకూడదని చెప్పారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని చెప్పారు.

క్యూ ఆర్ కోడ్ విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

మోసపు హామీలతో గద్దెనెక్కారు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ప్రజలను మభ్య పెట్టే విధంగా 'సూపర్ సిక్స్' పథకాలు అందిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కారని వైసీపీ పరిశీలకులు తుమాటి మాధవరావు ఆరోపించారు. స్థానిక అద్దేపల్లి ముస్లిం షాది ఖానా సమావేశ మందిరంలో 'సూపర్ సిక్స్' పథకాలపై క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెరుగు నాగార్జున మాట్లాడుతూ సంక్షేమ పథకాల రథసారథి జగన్మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికుటి అశోక్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోను క్యూ ఆర్ కోడ్ రూపంలో ప్రజలకు తెలియజేసేందుకు ఆవిష్కరించినట్లు తెలిపారు. ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు మోసాలను గడప గడకు వివరిస్తామని పేర్కొన్నారు. తొలుత అద్దేపల్లి పెట్రోల్ బంక్ నుండి షాదీ ఖానా వరకు ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కోగంటి లవ కుమార్, బుల్లిముంత ఏడుకొండలు, పడమట శ్రీనివాసరావు, భట్టిప్రోలు ఎంపిపి డివి లలిత కుమారి, జోషి కాంత్ పాల్గొన్నారు.

జిమ్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనగాని సత్య ప్రసాద్

రూ.35 లక్షలతో ఓపెన్ జిమ్ నిర్మాణం

ప్రజాశక్తి - రేపల్లె

ఆధునిక జీవన శైలిలో శారీరక చురుకుదనం ప్రతి ఒక్కరికీ అవసరంగా మారిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఎబిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో వాకింగ్ ట్రాక్ ప్రక్కన రూ. 35లక్షల పురపాలక నిధులతో ఓపెన్ జిమ్ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊహించని వేగంతో మారుతున్న జీవన శైలి, పని ఒత్తిడి, మానసిక ఒత్తిడిల మధ్య ఆరోగ్యంపై ప్రజలు ఎక్కువగా శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. కమర్షియల్ జిమ్‌లు అందరికీ అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఉచితంగా శారీరక వ్యాయామం చేసుకునే అవకాశాన్ని కల్పించేందుకు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మున్సి పాలిటీలు, నగర పాలిక సంస్థల్లో అమృత్ పథకం, స్మార్ట్ సిటీ మిషన్ పథకాల క్రింద పెద్ద పెద్ద పట్టణాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఒ రామలక్ష్మి, డిఎస్పి శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు, తహాశీల్దారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సుందరమ్మను సన్మానిస్తున్న ఆర్డిఓ గ్లోరియా

ఉత్తమ సేవలు అందించిన సుందరమ్మ

ప్రజాశక్తి - కర్లపాలెం

ప్రజలు, అధికారులతో మమేకమై తహాశీల్దారుగా సుందరమ్మ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా అన్నారు. స్థానిక వాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉద్యోగ విరమణ పొందిన తహాశీల్దారు సుందరమ్మకు అధికారులు, ప్రజలు, డీలర్లు, పలువురు శాలువలు, పూలమాలలతో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డిఓ గ్లోరియా మాట్లాడారు. కర్లపాలెం, బాపట్ల, పిట్టలవానిపాలెం తహాశీల్దర్లు పాషా, సలేమా, డి వెంకటేశ్వరావు, ఎంపిడిఒ అద్దురి శ్రీనివాసరావు, రిటైర్డు తహాశీల్దారు నాగ శంకరయ్య, ప్రసాద్, మల్లిఖార్జున రావు, ఆర్డిఓ ఆఫీస్ ఎఒ సాంబశివరావు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తవ్వితే చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఓలేరు గ్రామంలో కృష్ణా నది ఇసుకరీక్షని గురువారం మైనింగ్ శాఖ ఎజిఎం పి పని రాజ్ కుమార్ సింహ పరిశీలించారు. రీచ్‌లో కొన్ని నెలల క్రితం ఆయా ప్రాంతాల గ్రామస్తులు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టును కొందరు ఆశ్రయించారు. ఆయన వెంట మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కె స్నేహ, తహాశీల్దారు మేక శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం శివయ్య, ఎంఆర్ఐ ఫణి కుమార్, విఆర్ఒ ఎల్ సురేష్, గ్రామ సర్వేయర్ ఎన్ రాంబాబు, గ్రామస్తులు పరుచూరి రమేష్, వేములపల్లి సత్యనారాయణ ఉన్నారు.

చెరుకుపల్లి : మండలంలో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవని, ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తహాశీల్దారు సిహెచ్ పద్మావతి తెలిపారు. ఇటీవల మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం పరిశీలించారు. మొరవాగుపాలెంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎస్ఐ అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. మట్టి, బుసక తవ్వకాలకు అనుమతులు లేవని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక విఆర్ఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలను నిబంధనల మేరకు పరిష్కరించాలి

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిబంధనలను అనుసరించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం సి జి ఓ చిన్నారావు అమరావతి నుంచి గురువారం వీక్షణ సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పిజిఆర్ఎస్ పై పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో 3,046 మంది అర్జీదారుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ గాకుండా దివ్యాంగులు, ఎస్టీలకు న్యాయం చేయాలనే దక్పథంతో ప్రతి నెల నాలుగో శుక్రవారం ప్రత్యేక పి జి ఆర్ ఎస్ నిర్వహిస్తున్నామన్నారు. అర్జీదారులు ఇబ్బందులు పడకుండా ప్రతివారం ఉచితంగా వారికి భోజనం పెడుతున్నామన్నారు. ప్రతిరోజు అర్జీలు స్వీకరించడానికి కలెక్టరేట్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, అర్జీల పరిష్కారంపై పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పి జి ఆర్ ఎస్ సమర్ధంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని, క్షేత్రస్థాయిలోని అధికారులు లోపాలు సవరించుకోవాలని ఆదేశించారు. అధికారులు మీ పద్ధతి మార్చుకొని పనిచేయాలన్నారు. అధికారులు చురుగ్గా పనిచేస్తే గ్రామాలు, మండలాల్లో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. మీ చేతకానితనం, పనితీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు రానివద్దన్నారు. మండల, క్షేత్ర స్థాయి అధికారుల పని తీరు సరిగాలేదని సీఎంఓ సి జి ఓ చిన్నారావు అన్నారు. పి జి ఆర్ ఎస్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడండి, సమస్యను క్షుణ్ణంగా తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తదుపరి అర్జీదారులతో అధికారులు స్వయంగా మాట్లాడాలని ఆయన ఆదేశించారు. మార్టూరు మండలంలో 431అర్జీలు రాగా, 86 మంది నుంచి అభిప్రాయ సేకరణ చేశామన్నారు. ఆ మండలంలో 56 శాతం సరిగా స్పందించడం లేదని అధికారులపై ఫిర్యాదు చేశారని తెలిపారు. ముఖ్యంగా రెవిన్యూలో సర్వేయర్ల పనితీరు సరిగా లేదని, వారంతా పద్ధతి మార్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, పిజిఆర్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

మత్తుపై పోలీసుల ఉక్కుపాదం

- డ్రగ్స్ రవాణా చేస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్
- ఒంగోలు రైల్వే స్టేషన్‌లో పోలీస్, ఈగిల్ టీం విస్తృత తనిఖీలు

రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాదక ద్రవ్యాలు రవాణా చేసినా, విక్రయించిన, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలకు హాని కలిగించే గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిర్మూలించేందుకు, రైళ్లలో, పరిసర ప్రాంతాల్లో పోలీసులు, ఈగిల్ టీం, ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విశాఖపట్నం నుంచి కొల్లం ఎక్స్‌ప్రెస్ రైలులో కొంత దూరం ప్రయాణించి బోగీలను విస్తత తనిఖీలు నిర్వహించారు. స్థానిక పోలీసులు, ఈగిల్ టీం, రైల్వే పోలీసులు, మాదకద్రవ్యాలు గుర్తించే పోలీస్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది కలిసి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ సర్వీస్ సెంటర్లు, బోగీలు, అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి పార్సిల్‌ను అణువణువునా ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రకాశం జిల్లా పోలీసులు, ఈగిల్ టీం, జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ప్రకాశం జిల్లాను మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తయారు చేయడమే తమ లక్ష్యమని, అందుకోసం పోలీసులు పూర్తి స్థాయిలో కషి చేస్తున్నారన్నారు. యువతపై మాదకద్రవ్యాల ప్రభావం లేకుండా ఉండేందుకు, ప్రతి కళాశాల, పాఠశాలలో విస్తత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి నియంత్రణ దిశగా అలవాటు పడిన వారిని డి - అడిక్షన్ సెంటర్లో చేర్పించడం, సరఫరా చేస్తున్న వారిని గుర్తించడం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇకపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, పార్శిల్ సర్వీస్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తామని ఎస్‌పి తెలిపారు. అక్రమ మాదక ద్రవ్యాలు రవాణా చేసిన, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972, స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు లేదా పోలీసు వాట్సాప్ నంబరు 9121102266కు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్‌పి తెలియజేశారు. తనిఖీలో ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, మహిళా పిఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, ఒంగోలు టు టౌన్ సిఐ ఎం. శ్రీనివాసరావు, తాలూకా సిఐ విజయకష్ణ, ట్రాఫిక్ సిఐ వై.పాండురంగారావు, జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ మౌలా షరీఫ్, ఆర్‌పిఎఫ్ మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయించిన, సేవించినా కఠిన చర్యలు ఇన్‌స్పెక్టర్ కొండయ్య, ఈగల్ టీం ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా గృహాల నిర్మాణాలలో
పురోగతి లేకపోతే చర్యలు

బాపట్ల కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పక్కాగహాల నిర్మాణాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. పక్కా గహ నిర్మాణాల లక్ష్యాలపై గహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం ఆయన కలెక్టర్ ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గహాల నిర్మాణాలలో పురోగతి లేకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గహ నిర్మాణాలలో పురోగతి కనిపించాలని, ప్రస్తుతం లెంటిల్ దశలో ఉన్నవి స్లాబ్ దశకు, స్లాబ్ వేసినవి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు 8,299 పక్కాగహాల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. అందులో ఇప్పటివరకు 3,687 గహాలు పూర్తిచేసిన విషయాలను అధికారులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. మిగిలిన వాటిని ఎందుకు పూర్తి చేయలేదని మండల స్థాయి అధికారులను నిలదీశారు. మండలాల వారి నిర్దేశిత లక్ష్యాల పురోగతిపై ఆయన సమీక్షించారు. అధికారులు లక్ష్యాలను పూర్తి చేయలేకపోడానికి గల కారణాలపై ఆరా తీశారు. అధికారులకు ఛార్జి మెమోలు ఇచ్చినప్పటికీ వారి పనితీరులో ఎటువంటి మార్పు లేదని ఆయన అసహనం వ్యక్తపరిచారు. గహ నిర్మాణ శాఖలకు సంబంధించి రాష్ట్రస్థాయిలో 17వ స్థానంలో ఉన్న జిల్లాను 23వ స్థానానికి దిగజార్చారని ఆయన మండిపడ్డారు. నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి గహ నిర్మాణ శాఖ అధికారులను హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మండల ఈఈలు, డిఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సెప్టెంబర్ 30 వరకు సదరం స్లాట్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో వికలాంగుల కోసం సదరం స్లాట్ల బుకింగ్ ఈనెల 3 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. ఆయా తేదీలలో ప్రతి సోమ, మంగళవారాలలో సదరం స్లాట్లు అందుబాటులో ఉండనున్నాయి. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డిసిహెచ్‌ఎస్ ఆఫీస్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సూరిబాబు తెలిపారు. చీమకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం, గిద్దలూరు ఏరియా ఆసుపత్రి, యర్రగొండపాలెం ఏరియా ఆసుపత్రి, ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారాలలో సదరం స్లాట్లు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దిగజారుతున్న పొగాకు ధరలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పొగాకు ధరలు దిగజారుతున్నాయి. గురువారం కూడా కిలో కనిష్ఠ ధర రూ 150 కి పడిపోయింది. వారంపది రోజులుగా కనిష్ఠ ధర కిలోకు రూ 20 నుంచి 25 తగ్గి రూ 150 లకు కొనసాగుతుంది. 10 రోజులు నుంచి ఇదే ధర కొనసాగడం గమనార్హం.నల్ల రేగడి, ఎర్ర నేలల్లో కిలో రూ 230 నుంచి రూ 235 మద్యే నడుస్తుంది. గురువారం నాడు రీజియన్ పరిధిలో 9630 బేళ్లు ఆక్షన్‌కి రాగా 7184 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాలు చూపి 2446 బేళ్లను (25.40 శాతం) తిరస్కరించారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా..

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు
- 3, 4 డివిజన్లలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు దిశగా కూటమి ప్రభుత్వం పయనిస్తుందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు 3, 4 డివిజన్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. డివిజన్‌కు చేరుకున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు డివిజన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆయా డివిజన్లలోని ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని యాప్ లో నమోదు చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ప్రధానంగా ఒంగోలు నగర సుందరీకరణకు చర్యలు చేపట్టామని, పార్కులు, డివైడర్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే పోతురాజు కాల్వ ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఒంగోలు నగరానికి ప్రతి రోజు మంచినీరు ఇచ్చే కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. 3, 4, డివిజన్‌లో సిసి రోడ్లు, మురికి నీటి కాల్వలు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మిగిలిన సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వర్రావు, టిడిపి ఒంగోలు నగర అధ్యక్షులు బండారు మదన్, కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, టిడిపి నాయకులు వేమూరి మాల్యాద్రి, పఠాన్ హనీఫ్ ఖాన్, మహిళా నాయకురాలు కొక్కిలిగడ్డ లక్ష్మి, నగర కమిటీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్, కో-కన్వీనర్లు, డివిజన్ పరిశీలకులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పాల్గొన్నారు.

డివిజన్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల